
కథ

# మంచుపల్లకి

డా. ఎమ్. సుగుణరావు

**విజయనగరం వెళ్ళడానికి గురుద్వార్ జంక్షన్ దగ్గర నుంచున్నాడు రామారావు. వచ్చి అరగంటయినా ఏ బస్సు రాకపోవడంతో ఏమయివుంటుందో అని ఆలోచనలో పడ్డాడు. అప్పుడొక జీపు వచ్చి ఆగింది. ''బావూ వస్తావా విజీనగరం!'' అన్నాడా జీపువాడు. జీపులో పిట్టల్లా వేలాడుతున్న వారిని చూసి 'బాబోయ్ అందరినీ మడతపెట్టి కూరేసాడు జీపులో తను ఎక్కితే విజయనగరం చేరే సరికి కమిలిన మామిడి పండులా అయిపోవడం ఖాయం' అనుకుంటూ, ''వద్దునాయనా బస్సు వచ్చేవరకూ ఆగుతాను'' అన్నాడు రామారావు. ఇంతలో లారీ వచ్చి ఆగింది. లారీ వాడు తలబైటపెట్టి ''అయ్యారండి, విజయనగరం..'' అన్నాడు గుట్కా నములుతూ. వాడిని చూసి భయమేసింది రామారావుకు. ఒకసారి లారీ ఎక్కాడు. ఒక చేత్తో సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, మరో చేతిలో స్టీరింగ్ పుచ్చుకుని మధ్యమధ్యలో గుట్కా నములుతూ ఆ లారీవాడు విజయనగరం వెళ్ళేవరకూ రామారావు గుండెల మీద చావుబాజా వినిపించాడు.**



ఆ విషయం గుర్తొచ్చి తల అడ్డంగా ఊపాడు. లారీ వెళ్ళిపోయింది.

రామారావు గడియారం చూసుకున్నాడు. ఈరోజు ఆలశ్యం అయ్యేలా వుంది. ఇప్పటికే అధికారి మహాశయుడు తనను ఆలశ్యంగా వచ్చి తొందరగా వెళ్ళిపోయే ఉద్యోగుల జాబితాలో చేర్చేసాడు అనుకుంటూ మళ్ళీ ఆలోచనలో పడ్డాడు. ''రామారావు!'' అనే పిలుపు వినబడడంతో ఇహంలోకి వచ్చాడు. ఎదురుగా చిన్న నాటి మిత్రుడు వీర్రాజు ''ఏంటీ.. ఇక్కడున్నావ్..?'' అన్నాడు.


''విజయనగరం బదిలీ అయింది, బస్సుకోసం నిరీక్షణ'' అన్నాడు. ''ఏంటీ..? పదవీ విరమణ చేసే సమయం అయినా, బదిలీ అయిందా'' అన్నాడు వీర్రాజు.

''నాకు పదోన్నతి కలిగింది. చిన్న గుమస్తాను, పెద్దగుమస్తా అయ్యాను. ఆ పదవి విజయనగరంలో వుండడంతో బదిలీకి సమ్మతించాను. ఈ రెండు నెలల వైజాగునించి విజయనగరం క్రిందా, మీదా పడదామనుకుంటున్నాను'' అన్నాడు.

''అంటే అప్ అండ్ డౌన్ చేద్దామనా, భలేవాడివే నువ్ అచ్చ తెలుగులో మాట్లాడతావ్, కారణం ఏమిటో'' అన్నాడు వీర్రాజు నవ్వుతూ.

''నా కొడుకులిద్దరూ అమెరికాలో స్థిరపడ్డారు కదా... వాళ్ళు ఎలాగూ తెలుగు మరిచి పోయారు. కనీసం నా తదనంతరం నా మనవలైనా తెలుగు నేర్చుకోవాలని నా ఆశ. అందుకే అమెరికాలో వున్న వాళ్ళతో వారానికి ఒకసారి అచ్చ తెలుగులో స్వచ్ఛంగా మాట్లాడుతున్నాను. అదే అలవాటయిపోయింది, ఎవరితో మాట్లాడినా'' అన్నాడు రామారావు.

''అయితే నీ అభిరుచికి నా ధన్యవాదాలు ముఖే ముఖే సరస్వతి






అన్నారు. నిన్నుచూసి నాకూ అచ్చతెలుగు వచ్చేసింది.. మరయితే విజయనగరం వెళ్ళే బస్సులు ఇప్పట్లో రావు...'' అన్నాడు వీర్రాజు.

''దేనికీ'' అన్నాడు రామారావు.

''రాస్తారోకోలు ఎక్కువయ్యాయట, వాటికి వ్యతిరేకంగా రాస్తారోకో చేస్తున్నారు...'' అన్నాడు వీర్రాజు.

''అంటే'' అర్థం కాక మళ్ళీ అడిగాడు రామారావు.

''రాస్తారోకోలు ఆపాలని, రాస్తారోకో చేస్తున్నారు..'' అన్నాడు వీర్రాజు.

''ఇది మరీ బావుంది..!'' అని నవ్వుకున్నాడు. ఐదు నిమిషాల తర్వాత టాక్సీ వచ్చి ఆగింది. టాక్సీ డ్రైవరు రామారావు వంక చూసి ''అయ్యా విజయనగరం రండి..'' అన్నాడు.

ఆ మాటలకు రామారావు ఆనందపడి గబగబా కారెక్కాడు. వీర్రాజు కారులోకి తొంగి చూసి ''భలే, కారునిండా మల్లెపూలు, గులాబీలు, ఇంకా ఏదో అత్తరు జల్లిన వాసన అన్నాడు.

''ఔను... ఎవరో పెళ్ళిజంట... కారులో ఊరేగినట్టున్నారు'' అన్నాడు రామారావు డ్రైవర్‌తో.

ఆ మాటలకు డ్రైవర్ నవ్వుతూ కారుదిగి ''విజయనగరం, విజయనగరం..'' అంటూ అరవటం మొదలు పెట్టాడు.

రామారావు కారులో కూర్చుని ''వీర్రాజూ.... నాకు చిరకాలంగా ఒక కోరిక వుండిపోయింది, పెళ్ళికి పువ్వులతో అలంకరించిన కారులో ఊరేగాలని వుండేది.. ముప్పయ్యేళ్ళక్రితం నా పెళ్ళి జరిగింది. అప్పట్లో కారు తాకాలంటేనే వీలుకాని పరిస్థితి.. ఇప్పుడయితే అద్దెకారులు దొరుకుతున్నాయి. అప్పట్లో బాగా డబ్బున్న వారే పూలకారుల్లో ఊరేగేవారు కనీసం నా కొడుకులనయినా అలా ఊరేగిద్దామనుకున్నాను ఆ ఆశా తీరలేదు..'' అన్నాడు రామారావు నిట్టూరుస్తూ. ''ఎందుకూ.. అది పెద్ద సమస్య కాదే...'' అన్నాడు వీర్రాజు. ''లేదయ్యా.. నా కొడుకులిద్దరివీ అమెరికా ఉద్యోగాలు కదా, అందుకే హడావుడిగా పెళ్ళిళ్ళవడంతో వెంటవెంటనే ఆమెరికాకు ప్రయాణం కట్టారు. అలా నా కోరిక తీరలేదు. అయినా ఇంకో నెలలో నా కోరిక తీరబోతోంది. నాకు రెండో పెళ్ళి'' అన్నాడు రామారావు నవ్వుతూ.

''నిజంగానా... నీకు రెండో పెళ్ళా...'' అన్నాడు వీర్రాజు ఆశ్చర్యంగా.

''ఛ...ఛ...నువ్ అనుకున్న రెండో పెళ్ళికాదు. నా షష్టి పూర్తి వచ్చే నెలలో, అంటే మనం రెండోసారి పెళ్ళి చేసుకున్నట్టే కదా.., అపుడు పూలకారులో ఊరేగుతా.. నువ్ తప్పనిసరిగా రావాలి'' అన్నాడు రామారావు.

''అలాగే.... తప్పనిసరిగా వస్తాను.. ఇక ఉంటాను...'' అంటూ వీర్రాజు కదిలాడు.

ఐదు నిమిషాలసేపు డ్రైవర్ అరిచినా ఎవరూ కారెక్కక పోవడంతో డ్రైవరు కారును ముందుకు కదిలించాడు. కారులోని పూలగుబాళింపు ఆస్వాదిస్తూ, ''బాబూ నీపేరేంటి?'' అన్నాడు రామారావు డ్రైవర్‌తో, ''మస్తాన్... అందీ..'' అన్నాడు కారును ఆ రోడ్డు మలుపు తిప్పుతూ.

''మస్తానూ... వచ్చే నెలలో నా షష్టిపూర్తి, నీ కార్లోనే నేను సరదాగా తిరుగుతాను, నా శ్రీమతితో.. బాగా పువ్వులతో కారును ముస్తాబుచెయ్యాలి... పూల ఖర్చు నాదే.. వచ్చే నెల పదో తారీఖు.. ఏ బేరాలు పెట్టుకోకు'' అన్నాడు రామారావు.

''అలాగే నయ్యా'' అన్నాడు డ్రైవరు కారును వేగంగా పోనిస్తూ.

తన షష్టిపూర్తి గురించిన ఊహలలోనే నిద్రలోకి జారుకున్నాడు రామారావు.

***

''విజయనగరం వచ్చేసిందయ్యా..'' అన్న డ్రైవర్ మాటలతో కళ్ళు తెరిచాడు రామారావు.

గంటసేపు హాయిగా నిద్రపోయాను, బస్సు దొరక్క పోవడమే మంచిదయింది పైగా చక్కటి పూల గుబాళింపు అనుకుంటూ కారుదిగి డ్రైవర్‌కు డబ్బులిస్తూ.

''ఏమయ్యా... కారులో ఎవర్ని ఎక్కించావ్?'' పెళ్ళి జంటనా..'' అన్నాడు రామారావు.

డ్రైవరు మళ్ళీ నవ్వేసేడే గానీ సమాధానం చెప్పలేదు. ''ఏమయ్యా.. నవ్వుతావే తప్ప సమాధానం చెప్పవే'' అన్నాడు రామారావు.

''మీరేమనుకుంటే అదే...'' అన్నాడు డ్రైవరు. ''సరే భలే మొహమాటస్థుడిలా ఉన్నావే.. ఇక నా షష్ఠి పూర్తికి కారు తేవడం మరిచిపోవద్దు నీ సెల్ నెంబరివ్వు..'' అంటూ డైరీలో రాసుకున్నాడు. డ్రైవరు రామారావుకు నమస్కారం చేసి కారు ముందుకు పోనిచ్చాడు.

***

నెల తర్వాత రామారావు షష్టిపూర్తి. అమెరికా నుంచి కొడుకులు, కోడళ్ళు, మనవళ్ళు వచ్చేసారు. ఇంకా అతడి బంధువులు, సహ ఉద్యోగులతో ఇల్లంతా సందడిగా వుంది.

రామారావుకు ఉత్సాహంగానూ, ఉద్వేగంగానూ వుంది. ఇంటిముందు తాటాకులతో వేసిన పందిరి. ఆ పందిట్లో పువ్వులతో అలంకరించిన చిన్న మండపం ''మనవలనెత్తే తాత మనవాడబోతుంటే, మందార పువ్వంటి మా బొమ్మని'' అనే పాట సందర్భోచితంగా వాయిస్తున్నారు మంగళవాయిద్యాకారులు.

పట్టు పంచె, లాల్చీ, చేతికి బంగారు కడియం, మెడలో పులిగోరు పతకం, నెత్తిన తలపాగాతో రామారావు హుందాగా ఉన్నాడు. కంచిపట్టు చీర, వడ్డాణం, పాపిడిపిందెలు అతడి భార్యను కోడళ్ళు ఇద్దరూ కలిసి పెళ్ళికూతురిలా ముస్తాబు చేసారు. మనవలు చూడడం కోసం షష్టిపూర్తిని శాస్త్రయుక్తంగా చేయమని రామారావు పురోహితుడు సుబ్బన్న గారికి మరీమరీ చెప్పడంతో అంతా పద్ధతి ప్రకారం జరిగిపోతోంది.



రామారావును అతడిభార్యను పెళ్ళిపీటలమీద కూర్చోబెట్టారు. సుబ్బన్నగారు తన గంభీరస్వరంతో వేదమంత్రాలు చదివారు. కళ్యాణవేదిక మీద ఆ ఇద్దరి మధ్య వున్న శ్వేత వస్త్రాన్ని తీసి 'సమీక్షణం' తంతు జరిపారు. తలంబ్రాలు, కొంగుముడితో హోమం చుట్టూ ప్రదక్షిణ, మంగళసూత్ర ధారణతో షష్టిపూర్తి తంతు ముగిసింది. ఆ తర్వాత భార్యసమేతుడై గుడికి బయలుదేరాడు రామారావు. కళ్యాణ వేదిక నుంచి దిగి క్రిందకు వచ్చేసరికి అతడికి కనిపించింది ఒక కమనీయమైన దృశ్యం. దాదాపు ముప్పయ్యేళ్ళుగా అతడు కంటున్న కలనెరవేరబోతున్న క్షణం. ఎదురుగా కారు. రకరకాల పువ్వులతో అలంకరించిన ఆకారు ఒక పూలరథంలా వుంది. కారులోంచి దిగిన డ్రైవరు మస్తాను తెల్లటి బట్టల్లో, నెత్తిపైన తెల్లటి టోపీతో ఆ కారుపక్కన నిలబడి రామారావు దంపతులకు వినయంగా నమస్కారం చేసాడు. అంతలో ''హారతి తీసుకోకుండా వెళ్ళిపోతున్నారే...'' అంటూ సుబ్బన్నగారు హారతి పళ్ళెంతో వచ్చి రామారావు దంపతుల్ని ఆశీర్వదించి హారతిచ్చారు. రామారావు భార్య చేతిని వదలకుండా ముందుకు నడిచాడు. అతడికి ఉల్లాసంగా వుంది. ఆ క్షణం అతడు ఊహించనిది. దూరంగా పూలపల్లకీలూ తాను ఊరేగబోతున్న కారు అంతలో ఏదో తెలీని భారం గుండెల్ని ఆవరించింది. ఊపిరి పీల్చడం కష్టమయింది. అడుగుముందుకు వెయ్యలేక పోయాడు. భార్య చెయ్యి మరింత గట్టిగా పట్టుకున్నాడు. ముందుకు తూలాడు. అతడి భార్య పట్టుకోకపోతే నేలమీద పడేవాడే! ఆ షష్టిపూర్తికి వచ్చిన బంధువుల్లో ఒకాయన డాక్టరు. గబగబా వచ్చి చూసాడు. నాడి కొట్టుకోవడంలేదు. అతడికి అనుమానం వచ్చింది. 'ఛాతిలో నొప్పి, అయ్యో.. ఇప్పుడేం చెయ్యాలి' అనుకుంటూ దానికి సంబంధించిన ప్రాథమిక చికిత్స చేసాడు. రామారావులో మార్పులేదు. అచేతనంగా భార్య భుజాలమీద తల వాల్చి ఉండిపోయాడు. 'అయ్యో... జరగరాని ఘోరం జరిగిపోయింది. ఈ దుర్ఘటన నానోటితో ఎలా చెప్పేది..' అనుకుంటూ, ''ఈ షష్టిపూర్తి హడావుడి వల్ల వచ్చిన అలసటతో స్పృహతప్పింది, ఆస్పత్రికి వెళదాం, కారులో పడుకోబెట్టండి...'' అన్నాడు. కొడుకులిద్దరూ రామారావును కారులోకి చేర్చారు. రామారావు భార్యకు క్షణ కాలం మెదడు మొద్దుబారినట్టు అనిపించి, ఆ తర్వాత గట్టిగా ఏడవటంతో, ''అమ్మా రామారావుగారికి ఏమీ కాలేదు, మీరంతా ఇంకో కారులో రండి'' అంటూ డాక్టరు వేగంగా కారు ముందుసీట్లో డ్రైవరు పక్కనే కూర్చున్నాడు. రామారావు పెద్దకొడుకు ఆయన పక్కనే సర్దుకుని ''మస్తాన్, కారు పోనియ్యి'' అన్నాడు.

అప్పటి వరకూ ఆనందంగా వున్న ఆ వాతావరణంలో జరిగిన ఈ హఠాత్ పరిణామం గురించి ఎవరికీ అర్థంకాక మునుపే కారు అక్కడనించి వేగంగా కదిలింది. డ్రైవర్ మస్తాను నిర్లిప్తంగా కారు నడుపుతున్నా అతడిలో ఏదో తెలియని మానసిక ఆందోళన. ఆ నిశ్శబ్ద వాతావరణాన్ని తట్టుకోలేని రామారావు కొడుకు మెల్లగా ''డాక్టరు గారూ, నాన్నగారికేం కాదు కదా..'' అన్నాడు. ఆ మాటలకు ఆయన మౌనంగా రామారావు చేతులు పట్టుకుని ఒక్కసారి ఆ అబ్బాయి కేసి చూసేసరికి అతడి కళ్ళల్లో నీళ్ళు...

''క్షమించుబాబూ.. నాన్న గారు చనిపోయారు.. నా ఆశ తీరక ఇంకో డాక్టరుకు చూపిద్దామని నర్సింగ్ హోముకు బయలుదేరుతున్నాం. అయినా ఇంకో డాక్టరు చూసినా ఆయన మరణాన్ని ధృవీకరించటం తప్ప చేసేదేమీ లేదు'' అన్నాడు మెల్లగా.

ఆ మాటలకు రామారావు కొడుకు తండ్రివంక చూసి బావురుమన్నాడు. కారు నడుపుతున్న డ్రైవరు మస్తాన్ వెక్కి వెక్కి ఏడవటంతో రామారావు కొడుకు, ఆ డాక్టరు గారూ, ఒక్కసారిగా డ్రైవరు వైపుచూసారు. అతను కారునడుపుతున్నా తన కళ్ళలోంచి ఉధృతంగా వస్తున్న కన్నీటిని ఆపలేక పోతున్నాడు. ''అయ్యా.. నీకు రామారావు గారూ బాగా పరిచయం అనుకుంట'' అన్నాడు డాక్టరు. ఆ మాటలకు సమాధానం చెప్పకుండా మౌనంగా రోదిస్తూ తనలో తాను అనుకున్నాడు ఆ డ్రైవరు.

'ఆరోజు రామారావుగారిని నా కారులో విజయనగరం తీసుకెళ్ళాను. కారులోని పువ్వుల్ని అత్తరువాసనని చూసి పెళ్ళిజంట ఎక్కిన కారనుకున్నారు. అంతకు ముందు శవాన్ని తీసుకెళ్ళిన విషయం ఆయనకు తెలీదు. ఆయన కారు ఎక్కరేమో అని ఎంత తరిచి అడిగినా చెప్పలేదు.. వాస్తవానికి నా కారులో శవాలనే తీసుకు వెళతాను. నేను శవాల టాక్సీ మస్తాన్ని అని పాపం ఈ అమాయక పెద్దాయనకు తెలీదు. నేనూ ఆ పేరుని పెళ్ళి టాక్సీల మస్తానుగా మార్చుకుందామ నుకుంటున్నాను ఈయన షష్టిపూర్తి శుభకార్యంతో. ఆ వృత్తికి స్వస్తి చెపుదామనుకున్నాను.. అయినా నన్ను దేవుడు అదే పనిలో సాగమని పాపం ఈయనను లాక్కు పోయాడు... పూలకారు పూల కారు అని ఆనందపడిన ఈయనకు నాకారే పాడె అయింది.. ఆయన కలా తీరలేదు.. నాకలా తీరలేదు.. అయ్యో...'

మస్తాన్ అలా తనలో తాను కుమిలిపోతూ మూగగా రోదిస్తున్నాడు.

సాయంకాల సమయం చలికాలపు మంచుతెరలు చీల్చుకుంటూ ఆ టాక్సీ ముందుకు వెళుతోంది.

★

చిరునామా:
డాక్టర్ ఎమ్. సుగుణరావు
39-16-4, మాధవదార,
విశాఖపట్నం – 530 007
ఫోన్: 9393129945

## లైఫ్ని ఎంజాయ్ చేశా!

టాలీవుడ్, కోలీవుడ్ ప్రేక్షకులను తన గ్లామర్తో అదరగొట్టిన చార్మికి సినిమాలు లేక ఇటీవల కొంత కాలం ఖాళీగా ఉండాల్సి వచ్చింది. ఖాళీ సమయంలో లైఫ్ని ఎంజాయ్ చేశానని చెబుతోంది. గతంలో చేయాలనుకున్నవన్నీ ఇప్పుడే చేసేశానని అంటోంది. పాత సినిమాలు క్యాసెట్లు వేసుకొని తెగ చూసిందట! ఎప్పటి నుంచో పాత సినిమాలు చూడాలన్నది తన కోరిక! అది ఇప్పుడు, ఈ విధంగా నెరవేరిందని తెగ సంబరపడిపోతోంది. ఖాళీగా ఉన్నాను కదా అని బరువు పెరగకుండా, ఉన్న బరువును తగ్గించుకొని స్లిమ్గా అయ్యానని కూడా అంటోంది. రాబోయే తరువాతి చిత్రాలలో తనలో వచ్చిన మార్పు స్పష్టంగా కనిపిస్తుందని కూడా చెబుతోందామె.